తీర గ్రామాల్లో పక్కా సిమెంట్ రోడ్ల నిర్మాణం

మామిడికుదురు: ఏటా గోదావరి వరదల బారిన పడే తీర గ్రామాల్లో పక్కా సిమెంట్ కాంక్రీట్ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. ఆసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ (ఏఐఐబీ) నిధులు రూ.84 లక్షలతో చేపట్టిన బి.దొడ్డవరం–అప్పనపల్లి రోడ్డు పనుల్ని సోమవారం ఎమ్మెల్యే చిట్టిబాబు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తీర గ్రామాల్లోని రోడ్లు గోదావరి వరద ముంపునకు పాడైపోతున్నాయన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని పక్కా సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. పాశర్లపూడిలంక–లూటుకుర్రు–ఆదుర్రు రోడ్డును కూడా పక్కా సీసీ రోడ్డుగా ఆధునీకరిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని 90 శాతానికి పైగా రహదారులను తీర్చి దిద్దామన్నారు. మిగిలిన రోడ్లను కూడా త్వరలోనే అభివృద్ధి చేసే దిశగా కార్యాచరణ చేపట్టామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చెల్లుబోయిన రామశివసుబ్రహ్మణ్యం, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, గ్రామశాఖ అధ్యక్షుడు కేదారశెట్టి మల్లి, పార్టీ నేతలు గెడ్డం వెంకటేశ్వరరావు, వాకపల్లి వీరాస్వామి, కాంట్రాక్టర్ శ్రీనివాస్, యిళ్ల చిన్న, యనమదల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే చిట్టిబాబు అప్పనపల్లి బాలబాలాజీ స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. చైర్మన్ చిట్టూరి రామకృష్ణ స్వామి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, ట్రస్టీలు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


అప్పనపల్లిలో రోడ్డు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

కొనసాగుతున్న కార్మికుల ఆందోళన

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి దేవస్థానం కేశ ఖండన శాల కార్మికులు చేపట్టిన ఆందోళన సోమవారం మూడో రోజుకు చేరింది. కార్మికులు కత్తి డౌన్ చేసి విధులు బహిష్కరించి ఆందోళన కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం విడుదల చేసి జీవో 110ని అమలు చేయాలని, దానికి అనుగుణంగా ప్రతి నెలా రూ.20 వేలు వేతనం చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. పాత గుడి వద్ద ఉన్న కల్యాణ కట్ట వద్ద కార్మికులు ఆందోళన కొనసాగిస్తున్నారు. కల్యాణ కట్టలో పని చేస్తున్న 37 మంది కార్మికులకు నెలకు రూ.20 వేలు వేతనం వర్తింప చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. వీటితో పాటు నాలుగు నెలల బకాయిలను విడుదల చేయాలని కోరారు. ఆందోళనలో సంఘం అధ్యక్షుడు ఆర్ఎన్‌వీవీ సత్యప్రసాద్, కార్య దర్శి పీవీవీ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

డీసీతో చర్చలు విఫలం..

ప్రభుత్వం జారీ చేసిన జీవోను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మూడు రోజులుగా ఆందోళన చేస్తున్న నాయీ బ్రాహ్మణులతో ఎండోమెంట్స్ డిప్యూటీ కమిషనర్ ఎం.విజయరాజు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. 32 మందికి రూ.20 వేలు వంతున వేతనం చెల్లించాలని నాయీ బ్రాహ్మణులు డిమాండ్ చేశారు. ఆలయ ఆదాయాన్ని దృష్టిలో ఉంచుకుని 20 మందికి మాత్రమే రు.20 వేలు వంతున వేతనం అమలు చేస్తామని, ఆందోళనను విరమించాలని డీసీ కోరారు. దానికి నాయీ బ్రాహ్మణులు విముఖత చూపడంతో చర్చలు విఫలమయ్యాయి. దీంతో నాయీ బ్రాహ్మణులు తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు.

క్రీడా దినోత్సవంలో భాగంగా ఆటల పోటీలు

మామిడికుదురు: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం పలు ఆటల పోటీలు ఏర్పాటు చేశారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో ఈ పోటీలు జరిగాయి. ఖోఖో, కబడ్డీ, 100 మీటర్ల రన్నింగ్, షాట్‌పుట్, లాంగ్‌జంప్ తదితర విభాగాల్లో జరిగిన పోటీల్లో విద్యార్థులు ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మంగళవారం జరిగే జాతీయ క్రీడా దినోత్సవంలో బహుమతులు అందిస్తామని పాఠశాల ప్రధానోపాధ్యాయిని సీహెచ్ నిరంజని, పీడీ మట్టా శ్రీధర్ తెలిపారు.

టీటీడీ సభ్యుడు గాదిరాజుకు అభినందనలు

మలికిపురం: టీటీడీ పాలకవర్గ సభ్యుడిగా నియమితులయిన రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు గాదిరాజు వెంకట సుబ్బరాజును రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అభినందించారు. ఈ మేరకు తాడేపల్లిలో సోమవారం సుబ్బరాజును కలసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట చింతా రాజబాబు తదితరులు ఉన్నారు.


సుబ్బరాజును అభినందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

ప్రజలకు చేరువలో ప్రభుత్వ సేవలు

అయినవిల్లి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ సేవలను ప్రజలు ఉంటున్న గ్రామాల్లోనే అందించే విధంగా సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. సోమవారం వీరవల్లిపాలెం నూతనంగా రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.21.80 లక్షలతో నిర్మించిన ఆర్బీకే భవనాలను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రజలకు అడగకుండానే సంక్షేమ పథకాలు అందించి వారి మనస్సులను దోచుకున్నారన్నారు. అనంతరం అయినవిల్లిలంకలో గృహసారథులకు ప్రభుత్వం అందజేస్తున్న బీమా పథకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ సలాది బుచ్చిరాజు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మేడిశెట్టి రాజా, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు బి.చినబాబు, ఎ.నాగభుషణం, ఎం.చిన్ని, రాంబాబు, కె.రవి, సర్పంచులు సమాఖ్య మండల అధ్యక్షురాలు వార జయసావిత్రి తదితరులు ఉన్నారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

రాజోలు: వచ్చే నెల తొమ్మిదిన నిర్వహించే జాతీయ మెగా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రమీల రాణి అన్నారు. సోమవారం కోర్టు ఆవరణలో రాజోలు కోర్టు పరిధిలోని పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాజీకి అనుగుణంగా ఉన్న కేసుల్లో ఇరుపక్షాలతో మాట్లాడి కేసులు పరిష్కరించుకునే విధంగా చూడాలన్నారు. అదాలత్ ద్వారా ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసులు రాజీ చేసుకునే వీలు కలుగుతుందన్నారు. జూనియర్ సివిల్ జడ్జి కె.హిమబిందు, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి, నగరం ఎస్సైలు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

అంబాజీపేట: నందంపూడి శివారు పెచ్చెట్టి వారిపాలెంలో సోమవారం నుంచి ఈ నెల 30 వరకు లక్ష్మీగణపతి స్వామివారి త్రిదిన దీక్షా ప్రతిష్ఠ మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పెచ్చెట్టి లక్ష్మీనాగేశ్వరరావు, పెచ్చెట్టి నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు తెలిపారు. స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠను ఈ నెల 30న జరపనున్నామన్నారు. సోమవారం పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిష్ఠ రోజున భారీ అన్నసమారాధన చేపట్టామన్నారు.

చదువుపై ఆసక్తి కలిగించాలి

అంబాజీపేట: పాఠశాలకు వచ్చే విద్యార్థులపై ప్రేమతో మెలుగుతూ చదువుపై ఆసక్తి కలిగించాలని ఎంఈఓ మోకా ప్రకాష్ అన్నారు. మాచవరం శివారు ఎస్సీ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ సోమవారం పరిశీలించారు. పాఠశాలలో ఉన్న విద్యార్థులతో బ్లాక్ బోర్డుపై పాఠ్య పుస్తకాల్లో ఉన్న ప్రశ్న, జవాబులను రాయించి క్రమశిక్షణ, ఏకాగ్రతపై అవగాహన కల్పించారు.

చెరువు విస్తీర్ణం పెంచాలని కలెక్టర్‌కు వినతి

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానంలో జేజే ఎంలో నిర్మిస్తున్న మంచి నీటి చెరువు విస్తీర్ణం పెంచాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్‌కు, పల్లిపాలెం, గొంది, అంతర్వేది దేవస్థానం, అంతర్వేదికర ప్రజలు కొంతమంది వినతి పత్రం పంపారు. వినతి పత్రం నకళ్లను స్థానిక మీడియాకు అందజేశారు. తమ, తమ గ్రామాల్లోని సుమారు 30 వేల మంది ప్రజానీకానికి సరిపడా మంచి నీటి సరఫరాకు చెరువు పనులు జరుగుతున్నాయని, అయితే చెరువుకు ఉత్తరం వైపు నున్న గట్టుపై పడిపోవుటకు సిద్ధంగా ఉన్న భవనాలు, డిస్‌మేండిల్‌కు అనుమతి ఉన్న మరో భవనం ఉందన్నారు. వీటిని తొలగిస్తే చెరువు విస్తీర్ణం మరింత పెరిగి, భవిష్యత్తులో మరింత మంచినీటి నిల్వలు స్థాయి చెరువుకు చేకూరుతుందని ఆ పత్రంలో కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు.